సాక్షి
జగిత్యాల

మంగళవారం। 26। సెప్టెంబర్। 2023

న్యూస్‌రీల్

భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర కేబినెట్ కార్యదర్శి కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో జాతీయ రహదారి 563కు కావాల్సిన 18.900 హెక్టార్ల భూమి సేకరించామని, ఇంకా అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహమూర్తి, రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ రామారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏపీవో ప్రేమలత పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డిప్యూటీ సీఈవో


దావ వసంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రఘువరన్

జగిత్యాలజోన్: జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నియమితులైన ఎం.రఘువరన్ జెడ్పీ చైర్‌పర్సన్ దా వ వసంతను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ ఉండాలని వసంత ఆయనకు సూచించారు. రఘువరన్ వెంట ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ నరేష్ ఉన్నారు.

సత్వర న్యాయం కోసమే గ్రీవెన్స్ డే


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: వివిధ సమస్యలతో పోలీసులను ఆశ్రయించే వారికి సత్వర న్యాయం చేయడం కోసమే గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ భాస్కర్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 14 మంది నుంచి అర్జీలు స్వీకరించా రు. వెంటనే న్యాయం చేయాలని పోలీసు అ ధికారులను ఫోన్‌లో ఆదేశించారు. భూ సమస్యల విషయంలో అన్ని కోణాల్లో సమగ్ర వి చా రణ చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్త వ పరిస్థితులను తెలుసుకుని బాధితులకు న్యా యం చేయాలని అధికారులను ఆదేశించారు.

సెల్ఫీ విత్ గణేశ్


వెల్లుల్ల విష్ణు అండ్ జలపతినాయక్ గ్రూప్


కావ్య కుటుంబం


అనూప్ అండ్ సుహాన్


ఆడెపు హరీశ్


స్తంభంపల్లిలో యువయూత్ నాయకులు..

జగిత్యాలటౌన్:సాక్షి సెల్ఫీ విత్ గణేశ్‌కు విష్ణు అండ్ జలపతినాయక్ గ్రూప్ వెల్లుల్ల, చిట్టాపూర్ కావ్య కుటుంబం, అనూప్ అండ్ సుహాన్, విక్రం లాండర్ గణపతితో ఆడెపు హరీశ్, స్తంభంపల్లిలో యువ యూత్ సభ్యులు సెల్ఫీ దిగారు.

అల్పాహారం.. అనేక సవాళ్లు!

- వచ్చేనెల 24 నుంచి సర్కారు బడుల్లో టిఫిన్
- ఆరురకాలతో విడుదలైన ప్రతిపాదిత మెనూ
- మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెరిగేనా?
- మిడ్ డే మీల్స్ సిబ్బందికి పెరుగనున్న పనిగంటలు
- నిరంతర నిధులు అందాలంటున్న తల్లిదండ్రులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడేందుకు ఉద్దేశించిన అల్పాహారం పథకం అక్టోబర్ 24 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు అందించే ప్రతిపాదిత మెనూ విడుదలైంది. విద్యార్థుల శారీరక శ్రేయస్సు, పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అమలు చేయనున్న ఈ పథకం ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలో ఈ పథకం అమలవుతున్నా 2,400లకు పైగా పాఠశాలల్లో సిబ్బందికి పాత బకాయిలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అదే సమయంలో ఇదే ప్రస్తుత సిబ్బంది, మౌలిక సదుపాయాలు పిల్లలకు అల్పాహారం పెట్టేందుకు సరిపోతాయా? అంటే.. చాలవంటూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అల్పాహారం అమలు నేపథ్యంలో మిడ్‌డే మీల్స్ సిబ్బందికి పనిగంటలు, వంట సమయం పెరుగుతాయని దీన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వారికి సకాలంలో నిధులు విడుదల చేయాలని సూచిస్తున్నారు. ఒకవేళ మానవ వనరుల పెంపు సాధ్యం కాకపోయినా.. వారికి నిధుల విషయంలో లోటు రాకుండా చూసుకోవాలంటున్నారు.

రెండు లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే దాదాపు రెండు లక్షలకుపైగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల్లో పోషకాల కొరత నివారించడానికి ఉద్దేశించిన ఈ పథకంలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు మినరల్స్, ప్రొటీన్లను సమతూకం చేసేందుకు ప్రత్యేకమైన మెనూను అనుసరించనున్నారు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కోసం శ్రమిస్తోన్న సిబ్బందికి ఇకపై డబుల్ డ్యూటీలు అవనున్నాయి. గతంలో వీరంతా ఉదయమే వచ్చి, భోజనం కోసం కూరగాయలు, బియ్యం సిద్ధం చేసుకుని, మధ్యాహ్నం వేళకు అంతా సిద్ధం చేసేవారు. ఇప్పుడు ఉదయం 9 గంటలకల్లా సిబ్బంది విద్యార్థులకు అల్పాహారం సిద్ధం చేయాలంటే.. వీరంతా తెల్లవారక ముందే 5 గంటలకే పాఠశాల ప్రాంగణానికి చేరి పని మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన సమయానికి విద్యార్థులకు అల్పాహారం అందాలంటే ఇప్పుడున్న మానవ వనరులు, నిధులు పెరగాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసరాలు, కోడిగుడ్ల ధరలకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలకు వ్యత్యాసం ఉంటోంది. అందుకే ఈ వ్యత్యాసాలు తగ్గించి మిడ్ డే మీల్స్ సిబ్బందిపై ఆర్థిక భారం తగ్గించాలని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వారికి వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.

ప్లేటుకు ఎంత?

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మిడ్ డే మీల్స్ కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. విద్యార్థుల తరగతులను బట్టి ప్లేటుకు ఇంత అని నిర్ణయించింది. అవి ఇలా ఉన్నాయి? ఒకటి నుంచి 5వ తరగతి వరకు రూ.5.45 , 5 నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, 9 నుంచి 10వ తరగతి వరకు రూ.10.19 చొప్పున చెల్లిస్తోంది. 1 నుంచి 8వ తరగతి వరకు గుడ్డు కోసం రూ.5.00 చెల్లిస్తోంది. కొత్త కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.7.6 కోట్ల మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ లెక్కన నెలకు రూ.63.48 లక్షల వరకు ఖర్చవుతోంది. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో కాస్త అటూ ఇటూగా ఇంతే మొత్తం ఖర్చవుతుందని అంచనా. ఈ లెక్కన పాత జిల్లాలో దాదాపు రూ.50 కోట్ల వరకు మిడ్ మీల్స్ కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇక అల్పాహారం మొదలైతే.. ఇందులో కనీసం నాలుగో వంతైనా ఖర్చు చేయాల్సి వస్తుంది.



ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	సర్కారు బడులు	విద్యార్థులు	వినియోగం	మిడ్‌డే స్టాఫ్
కరీంనగర్	652	49,754	44,502	1,134
పెద్దపల్లి	554	34,021	34,021	921
జగిత్యాల	783	77,050	72,050	1,475
సిరిసిల్ల	478	50,328	41,328	863
మొత్తం	2,467	2,11,153	1,91,901	4,393

నోట్: ఇవి అందుబాటులో గణంకాలు మాత్రమే, ఇందులో స్వల్ప వ్యత్యాసాలు ఉండొచ్చు

విద్యార్థులకు ప్రతిపాదించిన మెనూ ఇదే

సోమవారం:గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
మంగళవారం:బియ్యం రవ్వ కిచిడి, చట్నీ
బుధవారం:బొంబాయ్ రవ్వ ఉప్మా, సాంబార్
గురువారం:రవ్వ పొంగల్, సాంబార్
శుక్రవారం:మిల్లెట్ రవ్వ కిచిడి, సాంబార్
శనివారం: గోధుమ రవ్వ కిచిడి, సాంబార్

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకాన్ని ఆహ్వానిస్తున్నాం. ఆహారం తీసుకోకుండా బడికి వస్తున్న నిరుపేద విద్యార్థులకు ఈ పథకం వరం. ప్రస్తుతం పౌష్టికాహారం లోపంతో ప్రార్థన సమయంలోనే చాలా మంది పిల్లలు కిందపడిపోతున్నారు. ఈ పథకం అమలైతే ఇలాంటి బాధలుండవు. పథకాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితోని అమలు చేస్తూ నిరంతరం నిధులు విడుదల చేయాలి. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెంచాలి.

– శనిగరపు రవి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణిలో బాధితుల వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చి అధికారులకు అర్జీలు సమర్పించారు. వివిధ సమస్యలపై 31 దరఖాస్తులు వచ్చాయి. అర్జీలను అదనపు కలెక్టర్లు లత, దివాకర స్వీకరించారు. సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఏ పోస్టులు పెంచండి



అసెంబ్లీ వేదికగా 13,582 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ప్రస్తుతం వాటిని 5,089కు కుదించడంతో కొంతకాలంగా డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న మాకు అన్యాయం జరుగుతుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల సంఖ్యను పెంచాలి. ఎస్జీటీకి అవకాశం కల్పించాలన్నారు.

బీఈడీ అభ్యర్థులు

ప్రభుత్వ భూమి కాపాడండి



కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారు సర్వే నంబర్ 309లోని సుమారు 50ఎకరాల గుట్టబోరు ఉంది. ఆ భూమిలో 15ఎకరాలను ముదిరాజ్, యాదవ కులస్తులు ఆక్రమించుకుని చదును చేస్తున్నారు. బోరు వేస్తుండగా గ్రామంలోని అన్ని కులాల వారు అడుకున్నాం. కలెక్టర్ జోక్యం చేసుకుని ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామస్తులు

అనర్హులకు దళితబంధు



ఆర్థికంగా ఉన్న వారికే దళితబంధు పథకం ఇస్తున్నారని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారం గ్రామస్తులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. డబ్బులు తీసుకుని అనర్హులకు దళితబంధు అమలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణం ఆపాలి



జగిత్యాలలోని రాంబజార్ ద్వారకానగర్‌లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్మాణం ఆగడం లేదు, కలెక్టర్ చొరవ తీసుకుని అక్రమ నిర్మాణాన్ని ఆపేలా చర్యలు చేపట్టాలి.

– ఆముద రమణ

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


మహిళా సంఘాలకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలో నియోజకవర్గంలోని ఆరు మండలాల మహిళాసంఘాలకు మంజూరైన సంఘం భవనాలకు రూ.5లక్షల చొప్పున 80 భవనాలకు రూ.4కోట్ల విలువైన ప్రొసీడింగ్‌లు అందించారు. మరో రూ.ఐదు లక్షలు అందించి భవనాలను అన్ని సౌకర్యాలతో నిర్మిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఆయా శాఖల అధికారులతో అక్టోబర్ 5 లోపు శంకుస్థాపనలు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం దేశానికి ఒక దిక్సూచీవంటిదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వచ్చేనెల 3న ధర్మపురికి మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో స్థానిక వివేకానంద కూడలి వద్ద ఫైలాన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

యాదవ సంఘం భవనానికి రూ.5లక్షలు

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేటలో యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరుకాగా.. కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈశ్వర్ సంఘం నాయకులకు మంజూరు పత్రాన్ని అందించారు. బీఆర్ఎస్ నాయకులు సాగి శ్రీనివాస్‌రావు, చిందం తిరుపతి, సాగి రమాపతిరావు, యాదవ సంఘం అధ్యక్షుడు జుర్రు రాజమల్లు, నాయకులు మహేశ్, వెంకటేశ్, చంద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి


కొత్త రుణాలు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- కొండగట్టులో ప్రత్యేక పూజలు

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం రైతులకు మాఫీ చేసిన రుణాల స్థానంలో బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల సింగిల్ విండోలో సోమవారం పంట రుణమాఫీ అయిన రైతులకు ప్రొసిడింగ్స్ కాపీలతోపాటు కొత్త రుణాలు అందించారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీని వర్తింపజేశామని పేర్కొన్నారు. రైతుబీమా, రైతుబంధు వంటి కార్యక్రమాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్పీ కేంద్రాన్ని ప్రారంభించారు. సంఘం చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సీఈఓ వేణు, డైరెక్టర్లు, రైతులు పాల్గన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

జగిత్యాల: ప్లాస్టిక్‌ను నిర్మూలించడం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ జ్యూట్‌బ్యాగులు వాడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంక్‌ను ప్రారంభించారు. ప్లాస్టిక్ నివారణలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ గంగమల్లు, కమిషనర్ అనిల్‌బాబు, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండగట్టులో పూజలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి వారిని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదం అందించారు. ఉపప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి, రామకృష్ణ, అధికారులు లక్ష్మారెడ్డి, నాయకులు ఐల్నేని సాగర్‌రావు ఉన్నారు.

కోనేరుకు కొత్త రూపు

- రూ.15 లక్షలు వ్యయం
- రూ.40 లక్షల ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్
- గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు




అందంగా రూపుదిద్దుకున్న కోరుట్లలోని కోనేరు

కోరుట్ల: చాళుక్యుల కాలం నాటి మెట్లబావి.. ఆ కాలంలో ఎంతో శోభాయామానంగా వెలిగిన కోనేరు. మహారాణుల అంతఃపురంలో ఓ భాగంగా ఉండేది. అంతటి ఘనత ఉన్న కోనేరు కాలక్రమేణా రూపురేఖలు కోల్పోయింది. కళ తప్పి చుట్టూ చెట్టు చేమతో బురదగుంతలా మారింది. కోరుట్ల చారిత్రక సంపదను పునరుద్ధరించాలన్న డిమాండ్ ప్రజల్లో వ్యక్తమైంది. దీంతో కోరుట్ల మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. కోనేరుకు కొత్త కళ వచ్చింది. అంతేకాదు కోరుట్లకు స్వచ్ఛతాలీగ్ పోటీల్లో గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డుతెచ్చిపెట్టింది.

రూ.15 లక్షల వ్యయం

ఏడాది క్రితం కోరుట్ల కోనేరును బాగు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ ప్రతిపాదనకు అనుగుణంగా కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో కోనేరును బాగు చేసేందుకు కొంత నిధులు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ప్రవేశపెట్టారు. కౌన్సిల్ సభ్యులు ఈ తీర్మానానికి ఆమోదం తెలపడంతో రూ.15 లక్షల నిధులు కేటాయించారు. అనంతరం ఆరు నెలల క్రితం కోరుట్ల కోనేరును బాగు చేసే పనులు మున్సిపల్ తరఫున ప్రారంభించారు. కోనేరులో పేరుకుపోయిన బురద చెత్త, చుట్టుపక్కల ఉన్న చెట్లు తొలగించారు. కోనేరు పక్కనే ఉన్న కొంత స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ ప్రహరీకి ప్రతిపాదించారు. కోనేరు పరిసరాల్లో పార్కు ఏర్పాటుకు సంకల్పించారు. ఈ పనుల కోసం ప్రభుత్వపరంగా నిధులు కేటాయించారు. టీయూఎఫ్ఐడీసీ కింద రూ.40 లక్షల కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఆ నిధులు అందుబాటులోకి రాగానే కోనేరు చుట్టూ పార్కుతోపాటు పిల్లల ఆట పరికరాలు అందుబాటులోకి రానున్నాయి.

చారిత్రక సంపదను కాపాడుతాం



కోరుట్ల చారిత్రక సంపదను పునరుద్ధరించి పట్టణ ప్రాధాన్యతను చాటిచెప్పుతాం. ఇప్పటికే 11 శతాబ్దం నాటి గడి కోట బురుజులకు కొత్త రూపు ఇచ్చాం. మరో చారిత్రక సంపదగా ఉన్న కోనేరును బాగు చేశాం. త్వరలో కోనేరు చుట్టూ ప్రహరీ, పార్కు నిర్మాణానికి సంకల్పించాం. ప్రభుత్వ గ్రాంట్ రాగానే పనులు పూర్తి చేస్తాం.

– అన్నం లావణ్య, చైర్‌పర్సన్

గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు..

కోరుట్ల చారిత్రకు సంపదగా మిగిలిన కోనేరులోకి దిగే మెట్లు, కోనేరు చుట్టూ ఉన్న పరిసరాలను బాగు చేసి లోపలికి వెళ్లి వచ్చే పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేశారు. కోనేరు నీటి అడుగుభాగంలో ఉన్న చెత్తను తొలగించడంతో దుర్వాసన లేకుండా పోయింది. ఫలితంగా స్వచ్ఛసర్వేక్షణ్ లీగ్‌లో భాగంగా చారిత్రక సంపద పునరుద్ధరణకు అందించే గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు కోరుట్ల మున్సిపల్ దక్కింది. ఈ అవార్డును త్వరలో ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు అందించనున్నారు.

క్లుప్తంగా

విపక్షాల మాటలు నమ్మొద్దు



రేగుంటలో సంజయ్‌కుమార్

మల్లాపూర్: బీఆర్‌ఎస్‌పై విపక్షాల దుష్ప్రచారం నమ్మొద్దని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాఘవాపేట, రేగుంటలో పర్యటించి గణేశుడికి పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. సుమారు రూ.2వేల కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపిందన్నారు. ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేణి మల్లేశ్, సర్పంచ్‌లు కుందేల్ల నర్సయ్య, నత్తి లావణ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఇనుగుర్తి సరిత పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన

ధర్మపురి: ఈనెల 28న నిర్వహించే గణపతి నిమజ్జన స్థలాలను ఎస్పీ పరిశీలించారు. ధర్మపురితోపాటు మండలంలోని రాయపట్నంలో గణపతుల శోభాయాత్ర ప్రాంతాలు, గోదావరి తీర ప్రాంతాలను పరిశీలించారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. డీజే సౌండ్, టపాసులు పేల్చేందుకు అనుమతి లేదని, అలాంటి వాటిని ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఆధారంగా చర్యలుంటాయన్నారు. రాయపట్నం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తున్న చెక్‌పోస్టును ఎస్పీ సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. వచ్చేనెల 3న ధర్మపురికి మంత్రి కేటీఆర్ రానున్నందున ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభాస్థలాన్ని హెలిప్యాడ్‌ను ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ రమేశ్, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సీఐ రమణామూర్తి, ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ, శ్వేత తదితరులున్నారు.

అండర్-14లో బాలుర సత్తా



బహుమతులు సాధించిన విద్యార్థులు

జగిత్యాలటౌన్: జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన అండర్-14 బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. కబడ్డీలో మెట్‌పల్లి ప్రథమ, కోరుట్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఖోఖోలో మెట్‌పల్లి ప్రథమ, కోరుట్ల రెండో స్థానంలో నిలిచాయి. వాలీబాల్ కోరుట్ల ప్రథమ, కొడిమ్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. జిల్లా యువజన, క్రీడల అధికారి రవికుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడాల విశ్వప్రసాద్, ఎస్.అశోక్, పీడీలు, పీఈటీలు పడాల కృష్ణప్రసాద్, శ్రీనివాస్, అజయ్‌బాబు, కోటేశ్వర్, విద్యాసాగర్, వేణు, వెంకటలక్ష్మి, మల్లేశ్వర్, రవి పాల్గొన్నారు.

26న చాకలి అయిలమ్మ జయంతి

జగిత్యాల: వీరనారి చాకలి అయిలమ్మ జయంతిని ఈనెల 26న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- సమస్యలు పరిష్కరించాలని ఆశల రాస్తారోకో
- రోడ్డుపై గంటపాటు ఆందోళన.. స్తంభించిన రాకపోకలు
- మద్దతు ప్రకటించిన డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- పోలీసులు, రెవెన్యూ అధికారుల జోక్యంతో విరమింపు



అంగన్‌వాడీ, ఆశలతో కలిసి రోడ్డుపై ధర్నా చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

గొల్లపల్లి: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశవర్కర్లు సోమవారం ఆందోళనకు దిగారు. కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ మండలకేంద్రంలోని జగిత్యాల, ధర్మారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు రోడ్డుపై బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ కదిలేది లేదని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. కరోనావంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఆశకార్యకర్తలు తమ ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందించారని, అలాంటి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే స్థానిక మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇప్పటివరకు వారి సమస్యలు తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. ఆశీర్వాద సభలకు సమయం ఉంటుంది గానీ.. సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడేందుకు ఉండదా..? అని ప్రశ్నించారు. గౌరవ వేతనంతో పాటు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ బెనిఫిట్స్ మాత్రమే కోరుతున్నారని, సీఎం జీతమో.. మంత్రి కొప్పుల ఈశ్వర్ జీతమో ఇవ్వమనడం లేదు కదా ఎద్దేవా చేశారు. ధర్మపురిలో అంగన్‌వాడీ టీచర్లపై టెంట్ కూలి గాయపడినా ఇప్పటివరకు వారిని మంత్రి పరామర్శించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్మపురిలో మంత్రి కేటీఆర్ బహిరంగ సభలోపు సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ సభను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, సర్పంచ్ చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యనారాయణ, సరసాని రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేశ్, టౌన్ అధ్యక్షుడు నేరెళ్ల మహేశ్, దిలీప్, గంగాధర్, మహిపాల్, శేఖర్, నక్క విజయ్, అంగన్‌వాడీ టీచర్లు తాండ్ర రమ, హరిప్రియ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ మూయించిన బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- ఫ్యాక్టరీని తెరిపించకుంటే ఆందోళనలే..
- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి



మాట్లాడుతున్న వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్: ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ ఆధారిత ఏకైక పరిశ్రమ నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేయించిన బీఆర్‌ఎస్ పార్టీకి రైతులు, యువత గుణపాఠం చెప్పాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలకేంద్రంలో మాట్లాడారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాల పేరిట కుల సంఘాలకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరితే పట్టించుకోవడం లేదని విమర్శించారు. వర్షాలతో నష్టపోయిన పొరుగు జిల్లా రైతులకు పరిహారం అందించిన ప్రభుత్వం.. ఈ ప్రాంత రైతులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ చెప్పుకుంటున్న రుణమాఫీతో రైతులెవరూ సంతృప్తిగా లేరన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మాదిరి ప్రతి పంటకూ రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు అవాస్తవమని, అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తే కలిసికట్టుగా పనిచేస్తారని పేర్కొన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, ధాన్యం కొనుగోలులో తాలు పేరిట దోపిడీని అరికట్టాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోట సంతోష్, వంగ అశోక్‌యాదవ్, భైరవేని శశిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కోరుట్ల: గణేశ్ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సోమవారం సమావేశమయ్యారు. సీరియల్ ప్రకారం విగ్రహాల శోభాయాత్ర చేపట్టాలని, సీరియల్ నంబర్ లేని వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. నిమజ్జనం రోజు భారీ పోలీసు బందోబస్తు ఉంటుందని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలోని పెద్దవాగులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తగినన్ని క్రేన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు.

పేదలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలను విస్మరించిందని, పేదలకు భరోసా కల్పించడంలో విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి, గంభీర్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. తక్కళ్లపెల్లిలో 50 మంది గీతకార్మికులు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల హామీ ఇచ్చిందని, పదేళ్లలో మండలంలో ఎన్ని ఇళ్లు నిర్మించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.5 లక్షలు ఇస్తామని, వంటగ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతకార్మిక సంఘం నాయకులు అల్లకొండ లింగంగౌడ్, భూపెల్లి సంజీవయ్య, రాజు, నల్ల రంజిత్, మండల నాయకులు కాయితి నాగరాజు, ఎం.డీ అజీం, వెలిచాల సత్యనారాయణ, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు మెట్‌పల్లి సైకాలజిస్ట్

జగిత్యాలటౌన్: భగవద్గీతను చదవడం, వినడం ద్వారా మానసిక ఆరోగ్యం పొందుతారని తెలుపుతూ చేసిన ప్రసంగానికిగాను మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుంటుక సురేశ్‌కుమార్ వరల్డ్‌బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ నారాయణగూడలోని ఏఐటీయూసీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో కేంద్రమాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాయింట్ సెక్రెటరీ ఇలియా చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని, వినాలని, తద్వారా మానసిక ఆరోగ్యం పొందుతారని తెలంగాణ సైకాలజీ అసోయేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుదీర్ఘ వెబినార్ మారథాన్‌లో తెలిపారు. సురేశ్‌కుమార్ జగిత్యాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా.. సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో సైకాలజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాంచంద్రం, జగిత్యాల అధ్యక్షుడు రఘునందన్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



11 లక్షల కరెన్సీతో గణపయ్యకు అలంకరణ

జగిత్యాలటౌన్: గణపతి నవరాత్రులు పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని టవర్ సర్కిల్ శివవీధిలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యను రూ.11లక్షల కరెన్సీతో ముస్తాబు చేశారు.

ఏ ఎస్సై కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న ఎస్పీ భాస్కర్

ధర్మపురి: అనారోగ్యంతో చనిపోయిన ఏఎస్సై రాజమల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ భాస్కర్ తెలిపారు. రాజమల్లయ్య వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ.. అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెల్సిందే. సోమవారం ధర్మపురికి చేరుకున్న ఎస్పీ రాజమల్లయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన వ్యక్తి రాజమల్లయ్య అని కొనియాడారు. ఆయన అంత్యక్రియలకు భారీగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజేశం(ఫైల్)

గొల్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన ఆకుల రాజేశం (45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేశం ఆదివారం తన ద్విచక్ర వాహనంపై దట్నూర్ వెళ్లాడు. లక్ష్మీపూర్‌కు వస్తుండగా చిల్వాకోడూర్ క్రాస్‌రోడ్డు వద్ద రాజారంపల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజేశంను చికిత్స జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. రాజేశం భార్య నంద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెల్గటూర్ మండలంలోకి బీర్సాని గ్రామం

జగిత్యాల: బుగ్గారం మండలంలో ఉన్న బీర్సాని గ్రామాన్ని వెల్గటూర్ మండలానికి బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వు తక్షణమే అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూకపల్లి సబ్‌సెంటర్‌ను సందర్శించిన కేంద్ర బృందం



పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం

మల్యాల: మండలంలోని నూకపల్లి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను కేంద్ర నాణ్యత ప్రమాణాల బృందం సోమవారం సందర్శించింది. డాక్టర్ నీలాంజన్ గంగోపాధ్యాయ, డాక్టర్ ఇమ్మదుల్ ఇస్లాం వెల్‌నెస్‌లో సెంటర్‌లో అందించే ఏడు ఆరోగ్య సేవలను పరిశీలించారు. కిశోర బాలికలకు అందించే సేవలు, కుటుంబ నియంత్రణ, పుట్టిన పిల్లలకు అందించే సేవలు, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధుల నియంత్రణ, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై ప్రశ్నావళిని పూర్తిచేసి, సేవలపై నివేదిక సమర్పించనుంది. డీఎంహెచ్‌వో శ్రీధర్, ఉప వైద్య, ఆరోగ్య అధికారి ఎన్.శ్రీనివాస్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి షమీయోద్దీన్, వైద్యులు మౌనిక, నరేశ్, సంతోష్, సతీశ్, డీపీఓ స్వామి, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన కేసులో యావజ్జీవం

జగిత్యాలజోన్: అప్పు ఇచ్చిన మహిళను హత్య చేసిన కేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బిరుదల హన్మక్కకు ఒకడే కుమారుడు. అదే గ్రామంలో హన్మక్క ఒక చోట, అతని కొడుకు మరోచోట నివసిస్తున్నారు. హన్మక్క అదే గ్రామస్తులతోపాటు చుట్టుపక్క గ్రామాలవారికి అవసరమంటే అప్పు ఇస్తుండేది. అయితే హన్మక్క 29 జూలై 2021న తన ఇంటి ముందున్న మురికి కాల్వలో చనిపోయి కనిపించింది. ఆమె ఇంట్లో ఉన్న ప్రామిసరీ నోట్లు, కొంత నగదు, ఒంటిపై ఉన్న బంగారపు గొలుసు, పడిగెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆమె కొడుకు లక్ష్మణ్ తన తల్లిని అప్పు తీసుకున్న వ్యక్తులే చంపి మురికికాలువలో పడేశారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ కృష్ణకుమార్ కేసును పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వారి విచారణలో వెల్దుర్తికి చెందిన బొమ్మెన భూమరాజం అనే వ్యక్తి అప్పు తీసుకుని, తిరిగి చెల్లించాలని కోరినందుకే హన్మక్కను చంపినట్లు తేలింది. భూమరాజంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అతనిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి. కిరణ్‌కుమార్, జి.రామకృష్ణ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి బొమ్మెన భూమరాజంకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి దుర్మరణం



భరత్‌గౌడ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. గోవిందుపల్లికి చెందిన నాగుల భరత్‌గౌడ్ (46) ఆదివారం సాయంత్రం విద్యానగర్‌లో తన మిత్రులను కలిసేందుకు వచ్చాడు. రాత్రి తిరిగి ఇంటికి వెళ్తుండగా జాంబాగ్ ప్రాంతంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కుటుంబంలో విషాదం

నాగుల భరత్‌గౌడ్ కొన్నాళ్లు గల్ఫ్ వెళ్లివచ్చాడు. ఇటీవలే స్నేహితులతో కలిసి వ్యాపారం చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే గోవిందుపల్లిలో కొత్తగా ఇల్లు కొనుక్కుని ఉంటున్నాడు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



జిల్లాకేంద్రంలో మానవహారంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

- ప్రభుత్వం సత్వరమే చర్చలు జరపాలి
- సీఐటీయూ జిల్లా కన్వీనర్ రాజలింగం

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సత్వరమే చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ రాజలింగం డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల శిబిరాన్ని సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ముందుగా అంగన్‌వాడీలు తహసీల్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26వేలు అందించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు అత్రం రవీందర్, సీఐటీయూ కన్వీనర్లు ఇందూరి సులోచన, ఎంఏ చౌదరి, అంగన్‌వాడీ టీచర్లు, సరిత, స్వప్న, శారద, కళావతి, గంగజమున, జ్యోతి, సౌజన్య, మమత, రజిత, పద్మ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- సీపీఐ నాయకుడు సుతారి రాములు



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీపీఐ నాయకులు సుతారి రాములు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఐడీవోసీ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేపట్టారు. మెస్ బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు రాక నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వంట కార్మికుల తొలగింపు ఆపాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, నియామకపత్రాలు అందించాలని కోరారు. కేరళ ప్రభుత్వం తరహాలో కనీస వేతన రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్న మహేశ్, మధ్యాహ్న భోజన కార్మికులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో ప్రతిభ



విద్యార్థులకు పతకాలు అందిస్తున్న రాపోలు సుదర్శన్

ఇబ్రహీంపట్నం: సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన 37వ జాతీయస్థాయి షోటోకాన్ కరాటే టీహెచ్‌ఆర్ కప్ పోటీల్లో ఇబ్రహీంపట్నం విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో మొత్తం వెయ్యి మంది పాల్గొనగా జిల్లా నుంచి 92 మంది వెళ్లారు. వీరిలో మండలకేంద్రానికి చెందిన ఆరుగురు పాల్గొన్నారు. బాలుర కటాస్ విభాగంలో ఎ.విశ్వంత్, కె.మనోహర్, కె.హర్షవర్ధన్, ఆర్.హర్షవర్ధన్ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం, ఎస్.విశ్వతేజ వెండి పతకం, జె.హర్ష కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే శిక్షకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ వంశీనాయుడు, పవన్ కళ్యాణ్, నవీన్, హరిప్రసాద్, విశాల, విశ్వతేజ అభినందించారు.

మహేందర్ చదువుకు 'ఇద్దం సిస్టర్స్' చేయూత

- మెడిసిన్ పూర్తయ్యే వరకూ సాయం
- ఏటా రూ.50 వేలు ఇస్తామని ప్రకటన

సాక్షి స్పందన



ఇద్దం సిస్టర్స్ పంపించిన రూ.50 వేలను మహేందర్ తండ్రికి అందిస్తున్న మల్లారెడ్డి దంపతులు

రాయికల్: మండలంలోని రామాజీపేటకు చెందిన మహేందర్ మెడిసిన్ చదువుకు దాతలు ముందుకొస్తున్నారు. 'డాక్టర్ కోర్సు పూర్తి చేయాలనుంది..' శీర్షికన ఈనెల 14న సాక్షిలో వచ్చిన కథనానికి అమెరికాలో ఉంటున్న రామాజీపేటకు చెందిన ఇద్దం సిస్టర్స్ స్పందించారు. అనూష, ప్రత్యూష, మేఘన, అంజన, వేద, శ్లోకా ఏటా రూ.50వేల సహాయాన్ని ఆయన చదువు పూర్తయ్యేవరకూ అందిస్తామని ప్రకటించారు. ఈ ఏడాదికిగాను రూ.50వేలను సోమవారం మహేందర్ కుటుంబ సభ్యులకు నల్లమల్లారెడ్డి, ఉమ దంపతుల ద్వారా సోమవారం అందించారు. సహాయం చేసిన ఇద్దం సిస్టర్స్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసరి రవియాదవ్, బెజ్జంకి మోహన్, ఉపసర్పంచ్ హరీశ్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజు, విజయ్, నాయకులు గంగారెడ్డి, ఆనంద్, లింగారెడ్డి, మల్లారెడ్డి, రాజేశ్వర్‌రావు, మహిపాల్‌రెడ్డి, రాజు, మహేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.